క్లుప్తంగా

దివ్యాంగుల చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలి

కారంచేడు: దివ్యాంగురాలైన పాదిలి దేవికపై జరిగిన దాడిపై నిందితులపై కేసు నమోదు చేయకపోగా.. ఆమె కుటుంబ సభ్యులపై నమోదు చేసిన కౌంటర్ కేసును ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకుడు పీ కొండయ్య డిమాండ్ చేశారు. సోమవారం చీరాల ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగ బాధితురాలు పాదిలి దేవికను పరామర్శించారు. అనంతరం కారంచేడు పోలీస్ స్టేషన్‌లో ఇంకొల్లు సీఐతో చర్చించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్, కొండవీటి శ్రీను, రవికుమార్, సతీష్, బ్రహ్మయ్య, వీరబాబు, శ్రీనివాసరావు, సూర్య, బాధితురాలి బంధువులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

చినగంజాం: మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని సోమవారం పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.5200 నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శీలం రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్‌ఐ అనూష, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్య

అద్దంకి: అంగన్‌వాడీలతో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అందుతుందని ఎంపీడీవో సింగయ్య అన్నారు. ఆయన సోమవారం మండలంలోని చెరువుకొమ్ముపాలెం అంగన్వాడీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు, పరిశుభ్రతతోపాటు సెంటర్ బాగా ఉండడంతో సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి సెంటర్ చేరుకోవాలని చెప్పారు.

సమాజ సేవలోనే ఆనందం

చీరాల రూరల్: సామాజిక సేవతో పాటు ఆధ్యాత్మిక సేవలు అందించడంలో వాకర్లు ముందువరుసలో ఉన్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జాండ్రపేట శివాలయంలో అన్నదానం చేసేందుకుగాను బట్టా మోహనరావు, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్టుకు రూ. 3500, శ్రీకృష్ణ గోశాలలోని గోవుల పోషణ నిమిత్తం రూ.1500 సంబంధిత నిర్వాహకులకు హైస్కూలు క్రీడా మైదానంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో చారుగుళ్ల గురుప్రసాద్, దేవకి సుబ్బారావు, దోగుపర్తి వెంకట సురేష్, డాక్టర్ ఇస్తర్ల బాబురావు, ఐ. సుభాషిణి, జీ. బదరీనాథ్, పూర్ణా, సీహెచ్ రమేష్, వీరాంజనేయులు, తిరుపతిరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆయిల్ దొంగతనంపై కేసు

అద్దంకి రూరల్: పెట్రోలు బంకు వద్ద పార్కు చేసిన ట్రావెల్ బస్సులో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరసింహారావు వివరాల మేరకు.. అద్దంకికి చెందిన ఎం శివశంకర్ లారీ ట్రాన్స్‌పోర్టు బిజినెస్ నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి స్థానిక రామ్‌నగర్ పెట్రోలు బంకులో సుమారు రూ.15 వేలు విలువ గల డీజిల్‌ను బస్సుకు కొట్టించి అక్కడే పార్కింగ్ చేసి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం వెళ్లి బస్సును బయటకు తీసేందుకు స్టార్ట్ చేయగా స్టార్ట్ కాలేదు. బస్సులోని డీజిల్‌ను చెక్ చేయగా ఏమి లేదు. దీంతో ఆయిల్ దొంగతనానికి గురైందని సాయంత్రం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

ఉపాధి హామీ పనులపై నేడు విచారణ


సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని అడవిపాలెం గ్రామంలో చేసిన ఉపాధి హామీ పనులపై నేడు ఆశాఖకు సంబంధించిన కమిషనర్ విచారణ నిర్వహించనున్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు కొందరు వారం రోజుల క్రితం ప్రజా సమస్యల పరిష్కార వేదిక న్యూఢిల్లీకి ఫిర్యాదు చేశారు. దానిపై గ్రామంలో విచారణ నిర్వహించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన నేడు గ్రామంలో విచారణకు రానున్నారు.

నేడు కారంచేడులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో మంగళవారం సాయంత్రం చంద్రబాబు మోసాలను ఎండగట్టేలా బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జువ్వా శివరాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు.

డెంగీ.. డేంజర్ బెల్స్


పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది



కాల్వలో నిలిచి ఉన్న మురుగు

- వందిళ్లపల్లిలో ఆరుగురికి డెంగీ
- దోమకాటుతో ప్రాణాలకు ముప్పు
- పారిశుద్ధ్య నిర్వహణలో చేతులెత్తేసిన అధికారులు
- వర్షాకాలంలో మరింత విజృంభించనున్న వైనం


స్వాతికిరణ్, వైద్యుడు

వేటపాలెం: చాలా రోగాలకు దోమలే కారణమవుతున్నాయి. దీనికి తోడు గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం కారణంగా దోమలు మరింత విజృంభిస్తున్నాయి. ఫలితంగా చాపకింద నీరులా సీజనల్ వ్యాధులు చుట్టుముడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాతవరణంలో వస్తున్న మార్పులతో పాటు ఇటీవల వస్తున్న సీజన్ వ్యాధుల్లో ఎక్కువ భాగం దోమకాటుకు సంబంధించినవే ఉంటున్నాయి. పందిళ్లపల్లిలో 10 రోజుల వ్యవధిలో ముగ్గురు పెద్దలు, ఒక చిన్నారికి డెంగీ జ్వరం సోకింది. అయితే ఇద్దరు పెద్దలు కోలుకున్నారు. చిన్నారికి ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదు. దోమ కాటు అంత ప్రమాదకరమైనది. రామన్నపేట -2 సచివాలయ పరిధిలోఒక డెంగీ కేసు, చల్లారెడ్డిపాలెం-2 సచివాలయ పరిధిలో 1, దోమలతో సోకే వ్యాధుల గురించి తెలసుకుందా .. దోమకాటు వల్ల లేనిపోని రోగాలన్నీ దీని ద్వారానే వస్తున్నాయని వేటపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వాతికిరణ్ చెప్తున్నారు.

దోమకాటుతో వచ్చే వ్యాధులు.. లక్షణాలు

మలేరియా: ఆడ అనాఫిలస్ దోమ కుట్టడంతో మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియాతో బాధపడుతున్న రోగిని దోమ కుట్టడంతో దాని కడుపులోకి వ్యాధికారక పరాన్నజీవి ప్రవేశించి అక్కడ పెరుగుతుంది. ఇదే దోమ మరో వ్యక్తిని కుట్టినప్పుడు ఆ వ్యక్తి రక్తంలోకి చేరి మలేరియాకు కారణమవుతుంది. చలి, వణుకుతో జ్వరం రావడం, శరీర ఉష్ణోగ్రత పెరిగడం, తరచూ జ్వరం రావడం దీని లక్షణాలు.

డెంగీ లక్షణాలు మరీ డేంజర్..

పగటి సమయంలో కుట్టే ఏడీస్ ఆడదోమల ద్వారా డెంగీ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరస్ జ్వరం, ఎముకలు కండరాలు, కీళ్లనొప్పులతో జ్వరం మొదలవుతుంది. ప్లేట్‌లెట్స్ అమాంతం తగ్గిపోతాయి. హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాలలో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దుద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతో పాటు చిగుళ్లు, ముక్కు ద్వారా రక్తం రావడం దీని లక్షణాలు.

చికున్ గున్యాతో చిక్కులే..

ఏడీస్ ఈజిప్టే దోమలతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చేతులు, కాళ్లలో కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుది. జ్వరంతో మనిషీ బలహీనంగా ఉంటారు. లక్షణాలు తలనొప్పి, వాంతులు, వికారంతో పాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు, సరిగా నిలబడలేపోవటం దీని లక్షణాలు.

పైలేరియా..

దీనిని బోదకాలు అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెంతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోదకాలు సోకుతుంది. లక్షణాలు.. తరచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిళ్లలు కట్టడం, వెన్నుపాము దగ్గరి నుంచి అన్ని అవయవాల పై ప్రభావం చూపుతుంది. అవయవాలకు వాపు, కాళ్లు, చేతులు, స్తనాలు, వరిబీజం, బుద్ధ, జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

మెదడు వాపు..

క్యూలెక్స్ ఆడదోమ కుట్టడంతో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది. లక్షణాలు.. ఆకస్మిక జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువ కావడం, విపరీతమైన తలనొప్పి, వాంతులు రావడం, అపస్మార స్థితికి లోనుకావడం, శరీరంలో ఏదో ఒకపక్క పక్షవాతానికి గురికావడం, ఫిట్స్ రావడం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

డెంగీ, చికున్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించాలంటే వైద్యం ఇంటి నుంచే ప్రారంభం కావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే తప్ప దోమలు నియంత్రణ పూర్తిగా సాధ్యం కాదు. కాబట్టి ఎవరికి వారు ఇంటి లోపల దోమలు లేకుండా చూసుకోవడమే మంచి మార్గం.

- రాత్రిలో పడుకోనే ముందు దోమతెర వాడాలి. లేదంటే శరీరం పూర్తిగా కప్పబడేట్లు దుస్తులు వేసుకోవాలి.
- వేపనూనె, కొబ్బరి నూనెను 1:1 నిష్పత్తిలో తీసుకొని చర్మంపై రాసుకోవాలి. వేప వాసన చూసి దోమలు పారిపోతాయి. వేపలో యాంటీ బ్యాక్టీరియా, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్, యాంటీ ప్రోటోజోల్ గుణాలు ఉన్నాయి.
- ఇంటి సమీపలో నీరు నిలిచిన చోట దోమలు గుడ్లు పెట్టి ఉంటాయి. కాఫీ డికాషన్ చల్లడం ద్వారా అందులోని దోమల గుడ్లు నీటిపైకి చేరతాయి. అవి ఆక్సిజన్‌కు లోనయి దోమలుగా మారకుండానే నిర్వీర్యమవుతాయి. నీటిలో దోమలు గుడ్లు కూడా పెట్టవు.
- దోమల నివారణకు యూకలిప్టస్, లెమన్ ఆయిల్‌ను చర్మంపై రాసుకోవాలి. దీనివల్ల మన చర్మానికి ఎలాంటి హాని ఉండదు. వీటిలో ఉండే సినోల్ రసాయనం యాంటీసెప్టిక్ కీటక నివారణిగా పనిచేస్తుంది.
- చీకటి పడుతున్న వేళలో ఇంటి తలుపులు మూసేసి కుర్పూరం వెలిగించాలి. 20 నిమిషాల తర్వాత తలుపు తెరిస్తే దోమలు కనిపంచవు, కర్పూరం మంచి కీటక నివారిణిగా పనిచేస్తుంది.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన


బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి

- నియోజకవర్గ ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి

కుంకలమర్రు (కారంచేడు): రాష్ట్రంలో నిరంకుశ పాలనతో పాటు, ప్రజా వ్యతిరేక పాలన సాగుతుందని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఆయన మండలంలోని కుంకలమర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జువ్వా శివరాంప్రసాద్ సారథ్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు వీలైనన్ని మోసపు మాటలు, వాగ్దానాలు చేశారన్నారు. వీటిని నమ్మిన ప్రజలు కూటమికి ఓట్లు వేశారన్నారు. మోసపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన ఇష్టానుసారం పాలన సాగిస్తూ ప్రజలను విస్మరించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేక ప్రగల్భాలు పలుకుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుత పాలిపాలను బట్టి బాధ పడే ప్రతి ఒక్కరికీ ధైర్యం చెప్పేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జువ్వా కోమలి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండా చౌదరిబాబు, చల్లా సుబ్బారెడ్డి, కొడాలి ధర్మానందరావు, యార్లగడ్డ శ్రీకాంత్, ముల్లా నూర్‌అహ్మద్, యార్లగడ్డ పాపారావు, బట్టు అనీల్‌కుమార్, బండారు ప్రబాకరరావు, కఠారి అప్పారావు, జంపని వీరయ్యచౌదరి, ఆసోది బ్రహ్మానందరెడ్డి, షేక్ అయేషాబుడే, ఎంపీటీసీ సభ్యురాలు చుక్కా రత్నకుమారి, సర్పంచ్ ఈదర సౌందర్య, ఉప్పలపాటి అనీల్, హరిబాబు, హరేరమిరెడ్డి, గోగినేని బుల్లెబ్బాయి, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌తో సమస్యల పరిష్కారం

- ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక మంచి అవకాశమని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. పలుశాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆర్డీవోకు అందించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన సచివాలయాలు, మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం అర్జీల స్వీకరిస్తారన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించగా ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. స్పందన కార్యక్రమంలో వివిద రకాల రెవెన్యూ, భూ సమస్యలపై ప్రజలు 21 అర్జీలను అందించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. అలానే మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇంటిస్థలాలు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై డీటీ సుశీలకు ప్రజలు అర్జీలు అందించారు.

ఘనంగా రిటైర్డు ఉద్యోగుల సంఘ వార్షికోత్సవం


సంఘ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ 28వ వార్షికోత్సవాన్ని సోమవారం స్థానిక పాపరాజుతోటలోని ఎస్‌జె రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు బత్తుల బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్డు అయిన వారు ఒక సంఘంగా ఏర్పడి సంఘ అభివృద్ధికి పాటుపడడం అభినందనీయమన్నారు. అనంతరం సంఘంలో సీనియర్ సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం 2025-28 సంవత్సరానికి పాత కార్యవర్గమే ఏకగ్రీవమైంది. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ కోశాధికారి పి.నాగరాజు, రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు వైవి నరసింహారావు, ఎస్.విశ్వరూపాచారి, బాపట్ల బ్రాంచి-1 అధ్యక్షులు కోడూరి ఏకాంబరేశ్వరబాబు, కార్యదర్శి ఎస్.సిద్ధయ్య, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రజరీస్ ఎం.చంద్రశేఖరరెడ్డి, చీరాల ఎస్టీవో దేవిరెడ్డి రమణారెడ్డి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ బోడా సురేష్‌కుమార్, మార్కాపురం వెంకట రామారావు, గోర్పుని శివప్రసాదరావు, భాగి కృష్ణమూర్తి, సంఘ నాయకులు, రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు



పల్లెపాలెంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ


వైదనలో పనులను పరిశీలించి సూచనలిస్తున్న ఎంపీడీవో

జే.పంగులూరు: మండల పరిధిలోని గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పీ సింగారావు అన్నారు. సోమవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సీజనల్ వ్యాధులపై రాకుండా తీసుకోవల్సిన చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా మురుగు నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలన్నారు. జ్వర బాధితులను గుర్తించి, జ్వర లక్షణాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శివచెన్నయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె సుమంత్, సీహెఓ జి భారతి, హెల్త్ ఎడ్యుకేటర్ వై అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాదులు ప్రభలకుండా కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీవో బి.శివన్నారాయణ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.

దగ్గుబాడు(కారంచేడు): వైరల్ ఫీవర్స్‌ను నిరోధించేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుంన్నామని కారంచేడు, దగ్గుబాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పృద్వీరాజ్, డాక్టర్ హరితలు అన్నారు. సోమవారం వారు మండలంలోని దగ్గుబాడు పీహెచ్‌సీ పరిధిలోని దగ్గుబాడు, పోతినవారిపాలెం గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో చీరాల సబ్ యూనిట్ ఆఫీసర్ రవిబాబు, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

కారంచేడు: ఇంటి పరిసరాలతో పాటు, పరిశరాల పరిశుభ్రతను కూడా ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని ఎంపీడీఓ కే నేతాజీ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కుంకలమర్రు గ్రామంలోని లోతట్టు ప్రాంతాలలోని పరిశరాలను పరిశీలించారు. జ్వరాలు ఉంటే వెంటనే మీ గ్రామంలోని ఆశా, ఏఎన్‌ఎంలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాంమ్మోహన్, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుటూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని పల్లెపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాలలో సోమవారం తహసీల్దార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పూర్ణచంద్రరావులు ఇంటింటికి పర్యటించారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఇతర సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు సోకకుండా అన్ని గ్రామ పంచాయితీలో పారిశుద్య కార్యక్రమాలతో పాటు వైద్య ఆరోగ్యశాఖచే జ్వర పీడితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపట్టాలని ఎంపీడీవో జీ. పాండురంగస్వామి కోరారు. సోమవారం వైదన గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రసాదరావు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటను పరిశీలించిన ఏవో

మార్టూరు: నకిలీ గుమ్మడి విత్తనాలు సాగు చేసి నష్టపోయానంటూ ఓ రైతు చేసిన ఫిర్యాదుపై మార్టూరు వ్యవసాయ అధికారి రామినేని లావణ్య సోమవారం బొల్లాపల్లి వెళ్లి గుమ్మడి పంటను పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు వీరవల్లి శ్రీనివాసరావు మార్టూరులోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సీడ్స్ షాపులో గుమ్మడి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేయగా మొలక రాలేదంటూ అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రైతు పాసు పుస్తకాలు, భూమిని పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న షాపులో గుమ్మడి విత్తనాలను కొనుగోలు చేసిన బొల్లాపల్లి గ్రామానికి చెందిన మిగిలిన రైతుల పంటలను కూడా ఆమె పరిశీలించారు. రైతు వీరవల్లి శ్రీనివాసరావు ఆరోపణల నేపథ్యంలో షాపులో ప్రస్తుతం ఉన్న లాట్ నంబర్ 60508150 కు సంబంధించిన రూ.32,500 విలువ గల 25 ప్యాకెట్లను నిలుపుదల చేసినట్లు ఆమె తెలిపారు. భూమి కొండమంజులూరు పరిధిలో ఉన్నందున జె.పంగులూరు ఏవో ఇచ్చిన ఫిర్యాదు తీసుకొని నమూనాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు ఆమె తెలిపారు.

యోగాలో చందలూరు విద్యార్థుల ప్రతిభ


యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

జే.పంగులూరు: యోగా పోటీల్లో చందలూరు విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు ఎస్పీకేఆర్ అండ్ ఎస్‌ఏవీఎస్ ఓరియంటల్ హైస్కూల్‌లో ఆదివారం యోగా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు 10.10.12 కేటగిరిలో ప్రథమ స్థానంలో ఏ తేజ, ద్వితీయ స్థానం ఎస్ నిరీక్షణ సాధించారు. బాలికల భాగంలో ప్రథమ స్థానం ఏ రత్నకుమారి, ద్వితీయ స్థానం కె హెప్సిబా, తృతీయ స్థానం వీ అమూల్య సాధించారు. 12.10.14లో బాలుర ఎం వెంకటేష్ ప్రథమ, బాలికలు చన్ స్మృతి ప్రథమం, ద్వితీయ స్థానం ఏ లిఖిత, తృతీయ స్థానం ఎస్ భవ్యశ్రీ, విజయం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజ, పీడీలు మధు, ప్రతిమ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

దుగ్గిరాల స్మారక మందిరానికి స్థలం కేటాయించాలి

చీరాల: చీరాల-పేరాల ఉద్యమకారుడు ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మారక మందిర ఏర్పాటుకు స్థలం కేటాయింపు కోసం గోపాలకృష్ణయ్య ఆశయ సాధన కమిటి, వివేకానంద సేవా సమితి చీరాల ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడిని కలిసి వినతి పత్రం అందించారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యకు చెందిన 20 ఎకరాల స్థలం రామనగర్‌లో ఉందని, ఆయన గతించిన తర్వాత శ్రీమదాంధ్ర విద్యాపీఠ గోష్ఠి, చీరాల వారు ఆర్టీసీ గ్యారేజీకి కొంత స్థలం అమ్మారన్నారు. మిగిలిన రెండు ఎకరాల స్థలం ఉందన్నారు. ఆ స్థలం సర్వే చేసి కమిటి వారికి ఇప్పించాలని కోరారు. స్మారక మందిరం ఏర్పాటు చేసి ప్రజాప్రయోజన ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రజా సమావేశాలు, గ్రంథాలయం, హాస్పిటల్, సుందరమైన పార్కు, కోదండ రామాలయం ఏర్పాటు చేస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కె.సాయి ప్రభాకరరావు, గుంటూరు హరిప్రసాదరావు, ముప్పల శివప్రసాదరావు, ఎస్ఎస్ ప్రసాదరావు, కాకర్ల వెంకటేశ్వరరావు, శంకరశెట్టి నాగేశ్వరరావు, కోటశంకరనారాయణ, తాడివలస దేవరాజు, తడవర్తి చంద్ర తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.30 లక్షల విరాళం


పీఠాధిపతికి విరాళం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

అద్దంకి: బ్రహ్మంగారి మఠంలో ఉన్న జగన్మాత ఈశ్వరిదేవి అమ్మవారి పూజ మందిర పునఃనిర్మాణం కోసం దాతలు విరాళం అందించారు. అందుకు ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు, అధికార ప్రతినిధి పులుకూరు నాగేశ్వరరావు కమిటీ ఆధ్వర్యంలో దాతల ద్వారా సేకరించిన రూ.2.30 లక్షల వారికి అందించారు. అందులో అద్దంకి వాసి బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు కొండముది రమేష్‌బాబు దంపతులు రూ.5,116 మఠం పీఠాధిపతులు వీరశివకుమార్ స్వామి విజయవాడ వెళ్తూ అద్దంకి విచ్చేసిన సందర్భంగా వారి చేతుల మీదు అందించారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి ఆళ్లగడ్డ వీర సుందరాచారి, కార్యదర్శి గుండెమెడ వెంకటేశ్వర్లు, ముత్తలూరు హరిబాబు, ప్రధాన కార్యదర్శి సుందరాచారి ఉన్నారు.

అశ్రునయనాలతో హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు


పోలీస్ లాంఛనాలతో వెంకటస్వామి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

చినగంజాం: గుండెపోటుతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్‌కు అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లాలోని జే పంగులూరు మండలంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన పర్వతరెడ్డి వెంకటస్వామి (52) అంత్యక్రియలు సోమవారం ఆయన స్వగ్రామం మండలం సోపిరాల గ్రామంలో పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. పోలీస్‌శాఖ సంప్రదాయ రీతిలో సిబ్బంది గాలిలో కాల్పులు జరిపి నివాళులర్పించిన అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. హెడ్ కానిస్టేబుల్ మృతి పట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలను కోరుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని శాఖపరమైన పరిహారం, రాయితీలు అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. పోలీస్ శాఖ అధికార లాంఛనాలతో వెంకట స్వామి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని చీరాల డీఎస్పీ మోయిన్, అద్దంకి రూరల్ సీఐ డీ మల్లికార్జునరావు, పంగులూరు ఎస్ఐ బీ వినోద్ బాబు, చినగంజాం ఎస్ఐ ఎస్ రమేష్‌లను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు వెంకటస్వామి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుని భార్య హేమలత, కుమార్తెలు శ్రీలక్ష్మి,పల్లవిలను పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం పోలీస్ శాఖ నుంచి రూ.1 లక్ష నగదును మృతుడి భార్యకు పోలీస్ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.